# మూర్ఖత్వం జిందాబాద్

*** పాలగిరి వేణు ***

మా గోపాలం మంత్రి అయాడు... ఎలా అయాడంటారా? వెరీసింపుల్. ఏమ్.ఎల్.ఏగా నెగ్గాడు... నెగ్గాక మంత్రయాడు...

గోపాలం ఎవరోకాదు... మావూరే... అదే మా వెంకట్రాయుడి మావమూడో కొడుకు...!

చిన్నప్పుడు మమ్మల్నందర్ని రచ్చబండదగ్గర కూడేసి రాజకీయాల గురించి ఏవేవో మాట్లాడేవాడు... వాడు మాట్లాడితే బుడమేరు పొంగి పొరలినట్లుండేది...

గోపాలం మంత్రి అయినప్పుడు మావూళ్ళో పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశాం... వేలమంది జనం సభకు వచ్చారు... అయినా మా వూళ్ళో జనాభా మూడువేలకన్నా మించదు. అదివేరే విషయం అనుకోండి... బహిరంగసభలో గోపాలానికి గొప్ప సన్మానం చేశాం... గోపాలం సంతోషించాడు... ఆ సభకు, సన్మానానికి ముఖ్యకారకులైన నన్ను, నా మిత్రుల్ని మా స్వంతఖర్చు మీదుగా హైదరాబాద్‌కు రమ్మని ఆహ్వానించాడు... మేము కూడా సంతోషించాం...

మేము ఎప్పుడూ హైదరాబాద్ చూళ్ళేదు... చూసే అవసరంగాని, అవకాశంగాని మాకు కలగలేదు... ఓ వారంరోజుల్లో ఓ ఏడుగురం హైదరాబాద్ కెళ్ళేందుకు నిర్ణయించుకున్నాం... ఎవడి ఖర్చు వాడిదే!...

ఆరోజు...

ఉదయం ఏడుగంటలకల్లా సికింద్రాబాద్ స్టేషన్లో దిగాం...


అబ్బ! ఎంత పెద్ద రైల్వేస్టేషన్... ఎన్ని రైళ్ళు... ఎంతమంది జనం... మాకు ఎంతో వింతగా వుంది...


మా చుట్టూ ఆటోవాళ్ళు మూగారు... మా ఏడుమందిని ఒకే 'ఆటో'లో తీసుకెళ్తేనే వస్తామన్నాం... ఏ పనిచేసినా మా ఏడుగురం కల్సి చేయాలనే నిర్ణయం మావూళ్ళోనే జరిగింది... కష్టాలనైనా, సుఖాలనైనా అందరం వుమ్మడిగా భరించాల్సిందే... ఎవడు తప్పినా మిగతావాళ్ళు, వాడిని గురించి బాధపడాల్సిందే కదా? ఆ భయం మాకుంది మరి...

ఏ ఆటోవాడూ రాలేదు...

ఇంతలో మాముందు ఓ 'టాక్సీ' ఆగింది... తమ తీసుకెళ్తావన్నాడు... సంతోషించాం... ఓ ఐదుమందిని టాక్సీ వెనుకసీట్లో యిసుక బస్తాల్ని పేర్చినట్లు సర్దేశాడు టాక్సీ డ్రైవర్... మా శాల్తీలు భారీ ఆయేమరి... వెళ్ళాల్సిన చోటు చెప్పాం...

ఓ పావుగంట దాటాక మాటాక్సీ పెద్ద భవంతి ముందు ఆగింది... మీటరు ఇరవై ఎనిమిది రూపాయలు చూపిస్తోంది... ఎంతచూపిస్తేనేం గాని, ఒక్కో మనిషికి తలా ఎంత వాటా పడితే అంత తలా యిచ్చేస్తాం అని అన్నాం... మా రైలు ఛార్జీలు, తదితర ఖర్చులు ఎవడికి వాడే యిచ్చుకోవాలని ముందుగానే నిబంధన అంటూ వుందికదా!... టాక్సీ డ్రైవర్ రెండు నిముషాలు ఆలోచించాడు... తలో పదమూడు రూపాయలు యివ్వాలన్నాడు... అందరం యిచ్చేశాం కాని మా అంజిరెడ్డి మాత్రం ఒక్కొక్కరికి పదమూడు ఎలా అవుతుందన్నాడు? మా అందర్లోనూ వాడికే గొప్ప తెలివి తేటలున్నట్లు, మేమందరం మూర్ఖులమన్నట్లు వాడి నమ్మకం... లెక్క ఎలావచ్చిందో తెలియకుండా టాక్సీ డ్రైవరుకు డబ్బు ఇచ్చేయడం అవివేకం అని అంజిరెడ్డి వుద్దేశం...




టాక్సీ డ్రైవర్ తన జేబులో నుండి జిడ్డు మరకలున్న ఓ కాగితం, పెన్సిల్ ముక్క బయటకు తీశాడు... లెక్కవేసి ఎలా పదమూడు ఒక్కొక్కరికి వాటా వచ్చిందో పేపరు మీద చూపించాడు...

అంజిరెడ్డి ఆ కాగితాన్ని తీసుకుని నిశితంగా పరీక్షించాడు.... బుర్రగోక్కున్నాడు... సీరియస్‌గా తనూ, తనవాటా పదమూడు రూపాయలిచ్చేశాడు...

"ఛలేసాబ్!" అంటూ టాక్సీ డ్రైవర్ మాకు సలాం పెట్టి వుషారుగా 'విజిల్' వేసుకుంటూ వెళ్ళిపోయాడు... మేముకూడా అతడికి సలాం పెట్టాం...

అంజిరెడ్డిని చూసి మేమందరం నవ్వుకున్నాం... అమాయకుడు పాపం... గేట్లో మమ్మల్ని ఓ ఖాకీబట్టలేసుకున్న ఓ బుర్ర మీసాల పెద్దమనిషి అడ్డగించాడు... మేము ఫలానా అంటూ వూరు, పేరూ చెప్పాం... హిందీలో ఏదో గొణుక్కుంటూ లోనికి వదిలాడు...

గోపాలం యింట్లోనే వున్నాడు... ఇల్లు కాదిది... ఇంద్రభవనం... మమ్మల్ని పేరు పేరున పలకరించి క్షేమ సమాచారాలు అడిగాడు... వూళ్ళో విశేషాలు అడిగాడు... మేము చెప్పేలోగా కాఫీలు వచ్చాయి... కాఫీలు తాగాం... గోపాలం మా పాత గోపాలమే! పదవి తెచ్చిన పొగరు, గర్వం అతడిలో లేవు మరి...

"ఎలా వచ్చారు?" అంటూ గోపాలం ప్రశ్నించాడు ఆప్యాయతతో...

"సికింద్రాబాద్ వరకు రైల్లో... స్టేషన్నుండి టాక్సీలో...." అన్నాడు అంజిరెడ్డి...

"వెరీగుడ్..."

"టాక్సీ ఛార్జీ ఇరవై ఎనిమిది అయింది? తలా పదమూడిచ్చాం" అన్నాడు మళ్ళీ అంజిరెడ్డి...

"ఏంటి తలా పదమూడిచ్చారా?" ఆశ్చర్యంగా అడిగాడు గోపాలం...

అవునన్నాం...

"అలాగా" అంటూ గోపాలం కళ్ళు మూసుకున్నాడు... జుట్టుపీక్కున్నాడు.. ఏదో ఆలోచిస్తున్నాడు... మీటరు ఛార్జీ ఇరవై ఎనిమిదే కదా అని మరోసారి మమ్మల్ని అడిగాడు... మళ్ళీ అవునన్నాం... ముందుగదిలో వున్న పి.ఏను పిలవమన్నాడు...

పి.ఏ గారొచ్చారు... పి.ఏ అంటే ఏమో అనుకున్నాం... మామూలు మనిషే...

"చూడయ్యా! వీళ్ళందరూ మావాళ్ళే!! మా ఊర్నుండి వచ్చారు..." అంటూ గోపాలం అన్నప్పుడు పి.ఏ గారు మా అందరికి నమస్కారం పెట్టాడు...

"వీళ్ళు 'టాక్సీ'లో సికిందరాబాద్


నుండి వచ్చారయ్యా! టాక్సీ ఛార్జీ ఇరవై ఎనిమిది అయితే తలా పదమూడు వసూలు చేశాడట ఆ టాక్సీ డ్రైవర్... ఇందులో ఏదో తిరకాసు వున్నట్లు అనుమానంగా వుంది... ఓసారి లెక్కేసి చెప్ప..." అన్నాడు గోపాలం... పి.ఏ గారు ఓ చిర్నవ్వు నవ్వాడు...

టాక్సీలో ఎంతమంది వచ్చారన్నాడు... ఏడుగురం అని చెప్పాం... తనూ ఓ పేపర్, పెన్ తెచ్చుకున్నాడు... ఖా అందరికి సులభంగా అర్థమవ్వటానికి వరుసగా కిందకు పదమూడును ఏడుసార్లు వేశాడు... కూడాడు... టోటల్ ఇరవై ఎనిమిది వచ్చింది...

"కరెక్ట్ సార్! టాక్సీ డ్రైవరుకు వీళ్ళిచ్చిన డబ్బు సరిగ్గానే వుంది..."

"వెరీగుడ్!" అన్నాడు గోపాలం...

పి.ఏ గారు కాలర్ ఎత్తుకుని మావైపు మరోసారి మందహాసం చేస్తూ నిష్క్రమించాడు... పి.ఏ గారు గొప్ప మేధావి అయ్యుండాలి...




"పదండి టిఫెన్లకు..." అన్నాడు గోపాలం...


"రైట్" అన్నాం ముక్త కంఠంతో...

* * *

"... ఇద్ద్రా జరిగింది..." అంటూ ముగించాడు గంగాధరం మాష్టారు...

"మీటర్ ఛార్జీ ఇరవై ఎన్మిమిది రూపాయలయితే ఏడుమందికి తలా నాలుగు రూపాయలే రావాలి కదా? మరి టాక్సీ డ్రైవర్ తలా పదమూడు వచ్చేలా ఎలా చేశాడు...? ఎవరైనా చెప్పగలరా!?" అంటూ ప్రశ్నించా డు గంగాధరం క్లాసులో కూర్చున్న విద్యార్థుల్ని... విద్యార్థులందరు బుర్రలు గోక్కున్నారు... జుత్తులు పీక్కున్నారు. ఎవ్వరూ చెప్పలేక పోయారనుకుంటే పొరపాటవుతుంది... రాజేష్ తను చెప్తానని సీట్లోంచి లేచి నిలబడ్డాడు...

"ఏం లేదు సార్! చాలా ఈజీ! టాక్సీ డ్రైవర్ మీటర్ ఛార్జీ ఇరవై ఎనిమిదిని ఏడుమందితో భాగారించడం మొదలెట్టాడు... ఇరవై ఎనిమిదిలో ఒక్కట్ల స్థానంలో వున్న ఎనిమిది కిందుగా ఏడు ఏక్కం ఏడు అంటూ వేశాడు... ఎనిమిది నుండి ఏడు తీసేశాడు... శేషం ఒకటి మిగిల్చాడు... ఇరవై ఎనిమిదిలో పదుల స్థానంలో వున్న రెండును తెచ్చి శేషంగా మిగిల్చిన ఒకటి ముందు వుంచాడు... అంటే ఇరవై ఒక్కటన్న మాట... ఏడుమూళ్ళ ఇరవై ఒకటి అంటూ ఆ ఇరవై ఒకటి కింద ఈ యిరవై ఒకటి వేసి శేషాన్ని శూన్యం చేశాడు... అంటే ఇరవై ఎనిమిదిని ఏడుతో భాగిస్తే పదమూడు వచ్చిందన్న మాట!




```
7)28(13
   7
 ----
  21
  21
 ----
   0
```

"ఇలా చూపించి ఆ ఏడుమంది దగ్గర తలాపదమూడు చొప్పున తొంభై ఒక్క రూపాయి సంపాదించాడు ఆ టాక్సీ డ్రైవర్..." అంటూ విశదీకరించాడు రాజేష్...

"మరి టాక్సీ డ్రైవర్ లెక్క సరిగ్గా వుందని ఎలా పి.ఏ గారు రుజువు చేశాడు... ఎవరైనా చెప్పగలరా??" అంటూ మళ్ళీ ప్రశ్నించాడు గంగాధరం... ఎవ్వరూ చెప్పలేక పోయారు... రాజేష్‌ను అడిగితే తనకు తెలియదన్నాడు. ఓ రెండు నిముషాలు గడిచాక రామశాస్త్రి లేచాడు... తను చెప్తానంటూ... "పి.ఏ గారువరుసగా పదమూడును ఏడుసార్లు వేశాడు. 13 13 13 13 13 13 13 (21) 28 ఒక్కట్ల స్థానంలో వున్న మూళ్ళన్నీ కూడాడు... ఇరవై ఒకటి వచ్చింది... ఆ యిరవై ఒకటిని నేరుగా పదుల స్థానంలో వున్న ఏడు ఒక్కట్లను వరుసగా ఇరవై రెండు, ఇరవై మూడు, ఇరవై నాలుగు, ఇరవై అయిదు, ఇరవై ఆరు, ఇరవై ఏడు, ఇరవై ఎనిమిది అంటూ కూడిక పూర్తి చేశాడు పి.ఏ గారు.. అంటే టాక్సీ డ్రైవర్కు తలా పదమూడు రూపాయలిచ్చింది సవ్యంగా వుందని నిరూపణ చేశాడు..." అంటూ రామశాస్త్రి ముగించాడు...

"క్లాప్స్ టు దీస్ బాయిస్" అని గంగాధరం మాష్టారు అనడంతో బల్లలు అదరగొట్టారు విద్యార్థులు.. చప్పట్లతో గది అంతా మార్మోగింది... 'బెల్' అయింది... క్లాసు నుండి పిల్లలందరూ బయటకు వెళ్ళి పోయారు... రాజేష్‌ను, రామ శాస్త్రిని పిలిపించి ఈ లెక్కలెలా మీకు తెలుసు అని అడిగాడు గంగాధరం...

"అబ్బే! ఏం లేదండీ! మా నాన్నగారే ఆ టాక్సీ డ్రైవర్..." అంటూ రాజేష్ చెప్పాడు.

"దాంట్లో ఏముందండీ! మా నాన్నగారే ఆ పి.ఏ గారు.. మా నాన్నగారికి కూడికలు తప్ప వేరే గుణింతాలురావు మరి..." అంటూ రామశాస్త్రి చెప్పాడు... గంగాధరం ఒక్కసారి తెల్లబోయినా, ఎందుకో వుషారు కలిగింది... చిన్నగా 'ఈల' వేశాడు...

క్రితం రాత్రి క్లబ్బులో డాక్టర్ పద్మారావు పై కథ చెప్పి, సమస్యల్ని యిచ్చాడు... ఆ సమస్యలకు ఎవరు సమాధానం చెప్తారో వాళ్ళకు తాగినంత 'బీరు' పోయిస్తానన్నాడు... ఈ రోజు రాత్రికి... అందుకే గంగాధరానికి సంతోషం కలిగింది...

మంత్రి గోపాలాన్ని కలవడానికి వచ్చిన ఆ ఏడు మందిలో డాక్టర్ పద్మారావు బావమరిది కూడా వున్నాడని మాత్రం ఎవ్వరికీ తెలియదు ఒక్క పద్మారావుకు తప్ప...

(ఆ మధ్య ఢిల్లీకి వెళ్లినప్పుడు మిత్రుడు శ్రీ పవంబాక బాలసుబ్రమణ్యం చెప్పిన జోకుకు ఆధారం "బాసు"కు కృతజ్ఞతలతో ....)

*